

వాహినివారి "సుమంగళి" మంచి

# నా కొడుకు ★ శ్రీ ధనికొండ హనుమంతరావు

(మొదటిభాగం క్రిందటి సంచికలో వెలువడింది.)

నాలుగు రోజుల్లో జ్వరం జారింది; ఈ నాలుగు రోజులూ సుందరి—తనకుయీ లోకంలో గోపాలమే దిక్కన్నట్టు సకల సపర్యలూ చేసింది.

అతని అవయవాలన్నీ మళ్లీ స్వాధీనం లోకి వచ్చాయి. ఎక్కడలేని ఆకలీ పుట్టుకు వచ్చింది.

"సుందూ! ఇవ్వాళ పథ్యం—"

"జ్వరం పోయిందా?"

"చూడు!"

ఆమె అతని శరీరాన్ని తాకి చూచింది. మామూలుగానే వుంది,

"ఏం?"—గోపాలం అన్నాడు సుందరి వంకచూస్తూ.

"జ్వరంలేదు గా?—అయినా సాయిత్రం దాకా చూద్దాం"

"ఈ ఆకలికి నేను ఆగలేను; నా కిప్పుడు పథ్యం కావాల్సిందే!"—గోపాలం ఖచ్చితంగా చెప్పాడు.

"మీకంత తొందర రెందుకు?"

"నాస్థితిలో నీవుంటే తెలిసేది"—గోపాలం నవ్వాడు.

ఆమెకూడా నవ్వింది.

"అన్నంవండు—" అన్నాడు తనకున్న తొందర్నంతా పొందుపరుస్తూ.

"తిని నిద్రపోతారా""

"ఊహూ."

గోపాలం ఏవేవో మాట్లాడుతూనే వున్నాడు. ఆమె అరగంటలో అన్నం వండి, పొట్లకాయ కూర తయారుచేసింది. అతను ఆతురతతో అన్నంవైపు చూస్తు న్నాడు.

"అయింది—రాండి"

గోపాలానికి పోయిన ప్రాణి లేచి వచ్చి నట్టుగా వుంది. కాళ్ళు కడుక్కువచ్చి అన్నం ముందు కూర్చున్నాడు. సరిగ్గా సయించకపోయినా ఎల్లాగో నాలుగు మెతు కులు నంజి పక్కమీద వాలాడు.

ఆమెకూడా భోజనం ముగించి గిన్నెలు దొడ్లో పడేసి వచ్చింది.

అతని కన్ను మూతపడటం చూచి ఆమె అంది: "పొద్దన్నకొద్దీ పథ్యం పుచ్చు కొని నిద్రపోతున్నారు; జ్వరం తలకెక్కు తుంది"

గోపాలం కన్ను తెరవకుండానే జవాబి చ్చాడు; "నేను నిద్రపోవటంలా; వూరికేనే కన్ను మూశా."

"అబ్బ! కళ్లు తెరవండి, నిద్ర మనకు చెప్పి వస్తుందా—ఏం"?

గోపాలం కళ్ళు తెరిచాడు.

కొంచెం ఆగి అన్నాడు; "బజారు పని వుంది: వెళ్ళిరానా?"

ఈ మొండి ధైర్యానికి ఆమె ఆశ్చర్య పోయి అంది, "ఇప్పుడేగా పథ్యం తీసు కుంది; అప్పుడే బజారెందుకు? ఒద్దు—"

పొగాకు మార్కెట్ ఎల్లావుందో తెలసి కోవాలని గోపాలానికి కుతూహలంగా వుంది; ఇతర వర్తకులందరూ తమ సరు కుని పూర్తిగా అమ్మేసి వుంటారు, ఈ సంవత్సరం తన వొక్కడి సరుకే మిగిలి పోయినట్టుగా వుంది. ఈ జ్వరం కొంచెం నిరుత్సాహపరిచినా—నష్టం వస్తుందని మాత్రం గోపాలానికి నమ్మకం లేదు.

మాట్లాడకుండా పక్కమీదికి వొరిగాడు.

"మళ్ళీ నిద్రపోతారు—" ఆమె అందు కుంది.

"వూరికనే పడుకున్నా...."

"అసలు పడుకోవద్దు"

"మరేం చెయ్యమంటావు?"

ఆమె సమాధానానికి కొంచెం ఆలోచిం చింది. ఇంటి చూరులోనుంచి పాతపేక నొకదాన్ని పెళ్ళగించింది. ఆ దొక్కు ముక్కల్ని చూచిన గోపాలానికి నవ్వు ఆగ లేదు.

గోపాలం నవ్వుకు ఆమె నిరుత్సాహ పడినట్టులేదు.

"పేకాడుదాం"—అంది ముక్కలకు పట్టిన దుమ్మును దబాయించి దులుపుతూ.

"నీకు పేకాటకూడా వచ్చా?"—గోపా లం కొంటెగా నవ్వాడు.

"ఏదో—కొద్దిగా!"

"ఈ ముక్కల్తోనేనా? పట్టుకుంటే విరిగి పొయ్యేట్టుగా వున్నాయి"

"కాలక్షేపానికేకదండీ!" ఆమె దీనంగా అడిగింది.

"గోపాలం మరేమీ మాట్లాడలేదు. ఏదో ఆడుతున్నాడేకాని మనస్సంతా మార్కెట్‌లోనే పచారు చేస్తోంది. గోపా లంది దురాశకాదు. వీలైనంత త్వరలో ఏ కొద్ది లాభం వున్నా వెంటనే సరకుని అమ్మే య్యాలని చూచాడు.

సాయంత్రం నాలుగు గంటలదాకా పేకాట కాలక్షేపం జరిగింది. గోపాలానికి సంపూర్ణ ఆరోగ్యం సమకూరినట్టుగా వుంది.

"ఒక్కసారి బజారు వెళ్ళివస్తా"—గోపా లం లేచి నిలబడ్డాడు.

"మీకంత తొందరెందుకు? రేపు పొద్దున వెళ్ళవచ్చు"

"జట్కాలో వెళ్లి అరగంటలో తిరిగి వస్తా."

"నేను పోనీను"—ఆమె తన రెండు చేతుల్నీ అడ్డుగా చాచింది. గోపాలానికి ఆమెను చూచి జాలి, నవ్వు కలిగాయి.

మాట్లాడకుండా మంచంమీద కూర్చు న్నాడు.

"కోపం వచ్చిందా?"—అతి దీనంగా అడిగిందామె.

"లేదు" అన్నాడు ఆమె తల నిమురుతూ

౫

తలవనితలంపుగా పొగాకు మార్కెట్ బాగా లేచింది. ఇంతకు పూర్వమే తన సరుకును అమ్మినట్టయితే గోపాలానికి ఇంత లాభం వచ్చి వుండేదికాదు. ఈ మలేరియాజ్వరం రావటం గోపాలానికి వొక విధంగా లాభసాటే అయింది.

గోపాలం ఉత్సాహానికీ, సంతోషానికీ పట్ట పగ్గాలు లేకుండా వున్నాయి. ఆనందం వెదజిమ్మే గోపాలం వదనాన్ని చూచి ఆ గిరాకీని కొంతవరకూ గ్రహించింది—సుందరి.

"ఇవ్వాళ చాలా కులాసాగా వున్నారు."

గోపాలం కూనిరాగాలు తీస్తున్నాడు.

"నాతో మాట్లాడరూ?"

"ఏమిటి?"

"ఇవ్వాళింత సంతోషంగా వున్నారేం?"

"తింగు రంగడు" అన్నాడు రూపాయిని మోగించినట్లు వేళ్ళను ఆడిస్తూ.

ఆమె నవ్వి వూరుకుంది.

ఆ సాయంకాలం గోపాలాన్ని వెతు క్కుంటూ, నురుగలు కక్కుతూ వచ్చి పడ్డది—టెలిగ్రాం. తన తండ్రి మరణ శయ్యమీద వున్నానిడ తెలిసింది. తను వచ్చికూడా రెండు నెల్లయింది; పనికూడా

పూర్తాఅయింది: ఇంక అక్కడ వుండటం అనవసరం.ఇంటి దగ్గర తను ఇప్పుడు అత్యవసరం.

ఈ సంగతి సుందరితో చెప్పాడు. ఆమె మాట్లాడకుండా జాలిగా చూచింది.

ఈ రెండు నెల్లనుంచీ సుందరి తనను దమ్మిడీకూడా అడుగలేదు: కాపరాన్ని ఎల్లా నడుపుతోందో? ఆమె సుబ్బారావును నమ్మి తన జీవితం ధ్వంసం చేసుకున్నందుకు గోపాలాం ఆత్మ ఘోషించింది....తన జ్వరంలో ఆమె చేసిన సపర్యా తన జీవితాంతం వరకూ మరువరానిది.

"విచార పడుతున్నావా— సుందూ?"

"లేదు—మళ్ళీ ఎప్పుడన్నా వస్తారా"

తనతో వస్తానంటుందేమో ననుకున్నాడు గోపాలం కాని ఆమె అంతపెద్ద కోరిక కోరలేదు.

"ఏమో!" అన్నాడు నిట్టూర్చుతూ.

ఆమె అదో విధంగా చూచింది: ఆ చూపులు తనను అక్కడే ఇనుప సంకెళ్ళతో బిగతీసి కట్టినట్టుగా వున్నాయి. ఆ దీనత్వం అతని హృదయానికి గ్రాహ్యమయింది—కాని తనేం చెయ్యగలడు?

"సుందూ! ఇంకెప్పుడన్నా కలుసుకుంటామో లేమో కూడా చెప్పలేను: కాని ఒక విధంగా ఇది మాత్రం తుదిసారే ననుకో—"

ఆమె అతి దీనంగా చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టింది. గోపాలానికి కూడా ఆమెను విడిచిపోవటం అతి కష్టంగా వుంది.

"సుందూ! ఏం కావాలో చెప్పు—ఏదైనా సరే ఇచ్చి వెళ్తాను."

సుందరి సంకోచంగా చూచింది.

"ఏదైనాసరే ఇస్తాను"—అన్నాడు గోపాలం అతిధీమాగా!....

"నాకు—"ఆమె ఆగింది.

"చెప్పు సుందూ;" ఆమె తల నిమిరాడు.

భయపడుతూ, పొడి గొంతుకతో ఆమె అంది: "నాకు అయిదువందల రూపాయిలు కావాలి."

గోపాలం ఆమెను చూచి నవ్వాడు: ఆమెకేమీ అర్థమవలేదు. అప్పటి స్థితిలో ఆమె ఏది అడిగినా గోపాలం ఇచ్చేందుకు సిద్ధమేనని ఆమెకేం తెలుసు? గోపాలానికి—ఈ సంవత్సరపు లాభాల్ని పట్టిచూస్తే ఆమె అడిగిన మొత్తంకూడా ఒక లెక్కలోది కాదనిపించింది.

"ఇంతేనా? తీసుకో—" గోపాలం అయిదు వందరూపాయిల నోట్లును ఆమెకిచ్చాడు.

సుందరి తన కోరిక ఇంత సులభంగా సాగుతుందనుకోలేదు. గోపాలంలాటి పురుషుడు తన జీవితాంతంవరకూ తన పక్కను వుంటే అదే భూలోక స్వర్గమని ఆమె తలిచింది. కాని కులీనుడైన గోపాలాన్ని కోరటం తనలాటి అపవిత్రురాలికి తగని పనని ఆమె ఆత్మ చెప్తోంది.

గోపాలం త్యాగానికీ, దయకూ, ధర్మానికీ—ఆమె మృదుహృదయం కరిగి కన్నీరు కార్చింది.

గోపాలం ఆమె కన్నీటిని తుడుస్తూ అన్నాడు:

"కన్నీరు కారుస్తావెందుకు సుందూ! వీలైతే మళ్ళీ వస్తాలే—నీవల్లా ఏడుస్తూంటె నేను వెళ్ళలేను."

అమె లేని ఉత్సాహాన్ని కల్పించుకొని అంది; "లేదు; మీరు వెళ్లండి; నేను ఏడవను."

గోపాలం బరువైన కాళ్ళను బలవంతాన లాక్కుంటూ ముందుకు సాగాడు.

తన దృక్పధం నుంచి మరుగుపడేదాకా గోపాలాన్ని చూచి, కన్నీరు కార్చి, వేడి నిట్టూర్పుల్ని విడుస్తూ అశ్రుపూరిత వదనంతో, బరువెక్కిన హృదయంతో—మంచంమీద వాలింది—అభాగ్య సుందరి.

౯

మనస్సుకు శాంతిలేదు, మతి చెడ్డట్టుగా వుంది. తండ్రి మరణంకన్నా—కూడా సుందరిని చూడాలనే అభిలాష గోపాలంలో ఎందుకు ప్రబలిందో—అతనికే తెలియదు. మనశ్శాంతికోసం అనేక వినోద ప్రదర్శనాలకు వెళ్ళాడు, ఏదో వొక విధంగా మనస్సు మళ్ళించుకోవాలని చూచాడు; అదంతా అతనికి అసాధ్యమయింది: ఎప్పుడూ సుందరి తన కళ్ళల్లో మసులుతూ వుంటుంది. డబ్బువుండికూడా—తను జీవితాన్ని అనుభవించ లేకుండా చేసింది—ఆమె! ఆమెలో ఇంత శక్తిని ఎల్లా ఇమిడ్చాడో భగవంతుడు!

రెండు వారాలూ ఎల్లా గడిచాయా! ఇంక ఒక్కపూట కాదు—ఒక్క క్షణంకూడా తన జీవితంలో ఆమె లేకపోతే ఏదో లోటు కన్పిస్తూనే వుంటుంది. చివరకు ఆమెకోసం వెళ్ళిరావాలనే బయలుదేరాడు.

ఆ ఇంటికి వెళ్ళాడు; తాళం వేసివుంది. పక్కభాగం షాపులో వున్నవాళ్ళను అడిగాడు.

'ఎక్కడికో వెళ్ళిపొయ్యారు' అని సమాధానం వచ్చింది.

'ఈ వూళ్ళోనే వున్నారా?' అని అడిగాడు 'ఏమో! మాకు తెలియద'న్నారు.

ఎక్కడికో వెళ్ళిపొయ్యారు! ఎక్కడికని ఎవర్నడుగుతాడు? ఆ పట్టణమంతా ఎల్లా గాలిస్తాడు?

అసంభవం! నిరాశా, నిస్పృహలు పెచ్చుగా ఆవరించాయి.

సుబ్బారావు పనిచేస్తూవున్న కాఫీహోటల్‌కు వెళ్ళి కనుక్కున్నాడు. రెండు నెలల క్రితమే సుబ్బారావు పని మానుకున్నాడని

తెలిసింది. ఇంకేం చేస్తాడు? పట్టణమంతా తిరిగాడు. ఎక్కడన్నా కన్పిస్తుందేమోనని, ఎక్కడ కన్పిస్తుంది? తన విశ్వ ప్రయత్న మంతా బుగ్గిలో పోసిన పన్నీరు! అతని జీవితంలో ఇంత పరివర్తనను తీసుకురాగల శక్తి సుందరిలో వుందని ఎవరనుకున్నారు?

చాలా రోజులవరకూ సుందరి విష యంతో గోపాలం బుర్ర చెడగొట్టకున్నాడు. స్నేహితుల్తో ఏదో మాట్లాడుతాడు; అదే మిటో తనకే తెలియదు; ఎప్పుడూ పరా కుగా, చికాకుతో వేగిపోతూ వుంటాడు.

అనేక పుస్తకాలు చదివాడు; చదివినంత సేపూ అదోమాదిరిగా వుండేది. ప్రతికథ లోనూ, ప్రతి నవలలోనూ—తనలాటి అభాగ్య నాయకుడు! ఆ నాయకులు కూడా తమ ప్రియురాళ్ళను పోగొట్టుకుంటారు; ఇది చదువుతున్నప్పుడు అతనికి కన్నీరు కారేది ప్రతి రచయితా తనను పట్టుకున్నట్టుగా వుం డేది. పుస్తకాన్ని అవతల పారేసేవాడు.

రాత్రులు సరిగ్గా నిద్రపట్టేది కాదు. చంద మామతోపాటు తను కూడా పంతంగా మేలు కొనేవాడు, అనంతాకాశాన్ని అవలోకిస్తూ, వేగుచుక్క రాకను ఎదురుచూస్తూ వుండే వాడు. అతను తన జీవితంలో మధుర క్షణా లన్నీ వెనకనే గడిచిపొయ్యాయనుకునే వాడు. ఇల్లాటి దుర్భరజీవితాన్ని ఇంకముం దెల్లా పొడిగించటమా అనేది అతనికి సమస్య అయింది.

ఒక స్త్రీ! అబల, జీవితాన్నంతట్నీ పాడ చెయ్యగలిగింది; చదువుకొని అనుభవం సంపాదించి, దాంతోపాటు విజ్ఞానాన్ని అభి వృద్ధి చేసుకొన్న తనలాటి యువకుడు, అంత దుర్బల హృదయాన్ని ఎదుర్కోలేక పోవటం శోచనీయాంశ మనుకున్నాడు. ఈ విషయం ఎప్పుడూ అనుకొనేదే! తనను తను సరిపెట్టుకుంటాడు; కాని వెంటనే ఆమె జ్ఞాప కానికి వస్తుంది; దాంతో మళ్ళీ బుర్ర తిరుగు తుంది, అసలు మానవ హృదయమే యింత దుర్బలమైంది; అందుకు తనేంచేస్తాడు? మెల్లి మెల్లిగా సాగిపోతూన్న నీడల్ని చూస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు

## ౧౦

మానవ జీవితంలో 'మ ర పు' అనేది మహోపకారం చేస్తుంది; అసలు లేకపోతే జీవితమే దుర్భరం. ఏనాడో జరిగినదాన్ని అంటిపెట్టుకు కూర్చున్నా కొన్నాళ్ళకు మరిచి పోవటం సహజం.

ఈ విషయంలో గోపాలం మొదటివాడు కాడు. నిజంగా ఎంతో ప్రేమించాననీ, ఆమె లేని జీవితం నిరర్థకమనీ తలపోసిన సలీమ్—అనార్కలీ మరణానంతరం, మెహరున్నీసా ప్రేమలో పడ్డాడు! గోపాలం కూడా—జహంగీర్ కాకపోయినా— జహంగీర్‌లాగ మానవజన్మ ఎత్తాడు కాబట్టే, ఆరుసంవత్స రాల అనంతరం 'సుందరి'ని మరిచిపోయి' వివాహమాడి గృహస్థు అయ్యాడు.

ఇంతగా వేధించి వేసారి వేసారి వెళ్ళి పోయిన సుందరి ఛాయలు కూడా ఇప్పుడు గోపాలం హృదయసీమలో ప్రసరింపవు; ఆ మూర్తిని, ఆ ఆదరణనూ అంతనూ కాల చక్రం తన గర్భంలో ఇగుర్చుకుంది.

బాపట్లలో కోర్టుపని పూర్తిచేసుకొని యంత్రం బండికి తిరుగివెళ్తూ వుండగా— ఆరేళ్ళ కుర్రవాడొకడు పరుగెత్తుకుంటూవచ్చి గోపాలం చెయ్యిపట్టుకున్నాడు.

"ఏమిటి?"—అన్నాడు గోపాలం, ఆ కుర్రవాడివైపు తీక్షణంగా చూస్తూ.

"మా అమ్మా పిల్చుకు రమ్మంటోది."

గోపాలానికి తెలిసినవాళ్ళు కాని, బంధు వులు కాని బాపట్లలో లేరు ఇంక యీ కుర్రవాడి తల్లి ఎవరో అతనికి అర్థమవ లేదు.

ఒకవేళ కుర్రవాడు పొరపడ్డాడేమోనని అటూ యిటూ చూచాడు; ఆ బజార్ని ఇంకె వ్వరూ లేరు.

"రాండి"—అని హెచ్చరించి చెయ్యి పట్టుకు లాగుతున్నాడు కుర్రవాడు.

ఈ చొరవ ఏమిటో గోపాలానికి గ్రాహ్య మవలేదు.

"ఎక్కడ?" అని అడిగాడు.

కుర్రవాడు వేలుపెట్టి చూపాడు 'ఆ ఇంట్లో' అని.

"పద"—కుర్రవాడితో కలిసి నడిచాడు.

ఇంట్లోకి వెళ్ళంగానే సుందరి ఎదు రయింది. సుందరి యీ ఆరుసంవత్సరా ల్లోనూ పూర్తిగా మారిపోయింది. పూర్వపు అందం ఇప్పుడామెలో లేదు. పూర్వం చిరు నవ్వులు చిందులాడే ఆమె పెదవుల మృదు త్వం మృగ్యం! సౌకుమార్యమంతాపోయి—బండబారింది! ముఖమంతా పాలిపోయి వుంది! గోపాలం ఆశ్చర్యపోయి చూస్తు న్నాడు.

"ఏం—మరిచిపొయ్యారా?"—ఆ గొంతు కలో కూడా పూర్వపు సంగీతం నశించింది. ఎంత మార్పు!

"లేదు" అన్నాడు గోపాలం.

"అల్లా కూర్చోండి."

గోపాలం కుర్చీలో కూలబడ్డాడు. ఆరు సంవత్సరాల నాటి సుందరేనా యీమె! రూపు మారింది; కాని హృదయం మారలేదు! పూర్వపు రెండు నెలల జీవితం కళ్ళముందు గిరగిరా తిరిగింది. ఇంత ఆనందాన్నిచ్చి, తనను దాదాపు పిచ్చివాణ్నిగా చేసిన సుం దరి! సుందరీ! ఎంత మారిపొయ్యావ్? అతని కళ్ళనీళ్ళు వచ్చాయి. ఆమె చూడ కుండా వొత్తుకున్నాడు.

సుందరికి కూడా ఆ దినాలు తలపుకు వచ్చాయి. గోపాలంగో ఎక్కువ మార్పు లేదు. అమె అంతరాత్మ ఎందుకో ఘోషించి అశ్రు జలాన్ని కార్చింది. పక్కకు తిరిగి కళ్ళనీళ్ళు వొత్తుకుంది.

"ఇప్పుడు సుఖంగా వున్నావా— సుందూ!"—గోపాలం అడిగాడు దుఃఖం వెలి కురికే కంఠంతో.

"నా జీవితంలో సుఖమేమిటి? ఆరోజులు పొయ్యాయి."

ఒంచిన ఆమె ముఖాన్ని చూడలేక పోయినా ఆమె ఎందుకో విచారిస్తోందని మాత్రం గోపాలం గ్రహించాడు.

రెండు నిమిషాలు గోపాలం అడిగాడు: "ఇక్కడ ఎవరిదగ్గరున్నావు?"

తనలాటివాడే ఆమెను ఎవరో జేరదీసి వుంటాడని గోపాలం తలచాడు.

"ఆయన దగ్గరే!"

"ఎవరాయన?"

"సుబ్బారావుగారు"— ఆమె కొంచెం సిగ్గుపడుతూ చెప్పింది.

"వాడితో మాట్లాడావు కాదూ?"

"లేదు- ఆయన— మా ఆయన!"

గోపాలం ఆశ్చర్యపోయాడు. సుందరి సుబ్బారావు పెళ్లామా? ఈ సంగతి తనకు ఇదివరకు తెలియదే!

"నేను వెళ్ళాకనే పెళ్ళిచేసుకున్నాడా?"— అతని కంఠంలో గంభీరత కన్పిస్తోంది.

"లేదు—అంతకు రెండేళ్లముందే!"

ఆరి దౌర్భాగ్యుడా! అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యనా ఇతరుల దగ్గరకు పంపటం! సుబ్బారావులాటి అధముడు యీ లోకంలో మచ్చుకైనా దొరుకుతాడని గోపాలం తలవలేదు! అతనిలో ఆవేదనా జ్వాలలు అమితంగా ప్రజ్వరిల్లాయి.

"రాత్రికి వస్తారు—వుండండి."

ఇంకా వాడి మొఖం చూడటమా! అసంభవం! ఒర్రినాప! కొరగాని తృణం!

ఇంకొక్క ఆనుమానం గోపాలాన్ని పీడిస్తోంది.

"సుందూ!" నేను నీకు అయిదువందలిచ్చా—జ్ఞాపకం వుందా?"

"మీ సహాయాన్ని మరువగలనా?"

"అది కూడా వాడు అడగమన్నదేనా?"

"ఆ" ఆమె తలవూపింది.

ధన సంపాదనకేనా సుబ్బారావు ఇంత నీచతకు పాల్పడ్డది! తనకే సుందరిలాటి భార్య వున్నట్టయితే పువ్వుల్లో పెట్టి పూజించేవాడు. ఈ విధవ వివాహపు తంతు—సుబ్బారావుకు తన భార్యమీద, ఆమె శరీరంమీద, ఎంత అధికారాన్ని ఇచ్చింది! ఆమెను తన అగ్గిపెట్టెలాగు వాడుకున్నా యీ సంఘంలో అడుగగలిగే పెద్దమనిషేడీ?

సుందరి!—దౌర్భాగ్యపు సుందరి! జీవచ్ఛవం! భర్తకోసం, ధన సంపాదనకోసం శరీరాన్ని త్యాగం చేసిన సుందరి! ఆమె హృదయం ఎంత విశాలమయింది! ఆమె దృక్కులు ఎంత ప్రశాంతమైనవి! సుబ్బారావులాటి అధముడి చేతుల్లో ఆమె జీవితం నలిగిపోతుంటే లోకమంతా గుడ్లు మిటకరించి చూస్తోంది! ఒక్కరూ—ఒక్క కన్నీటిబొట్టును విడువరు. సుందర్ని గూర్చి సుబ్బారావు అబద్ధమాడాడు. అందుకు తన యువకరక్తం స్వేచ్ఛగా ప్రవహించింది. నీతీ నియమం లేని పనికాదా అది? ఆమె తన భార్య అని చెప్పినట్టయితే—సుబ్బారావును కాకపోయినా—సుందరి ముఖాన్ని చూచయినా తను డబ్బిచ్చేవాడు. ఈ సంపాదనకోసం ఒక జీవి నలగటం, రెండోజీవి ఆనందించటం జరుగుతూన్న యీ లోకంలో ఇంకెన్నెన్ని వింతలున్నయ్యో?

విస్తుపోయి చూస్తూన్న గోలాన్ని చూచి ఆమె అంది; "ఇది మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు. నేను ఆయన కోసమే ఇంత పనీ చేశాననుకోకండి. నాకూ్కడా అప్పటిలో మీమీద మనసు వుంది. నేను మిమ్మల్ని ఒక విధంగా నమ్మించి మోసంచేశాను— క్షమించండి."

కన్నీరు దొర్లుతూన్న సుందర్ని చూచి గోపాలానికి జాలికలిగింది. తన జ్వరమూ, ఆమె సపర్యా అదంతా జ్ఞాపకం వచ్చింది. అతనికూ్కడా కళ్ళనీళ్లు తిరిగాయి.

"ఇందులో క్షమించేందుకేమీలేదు సుందూ!"—గోపాలం అన్నీ మరిచిపోవాలని ఆత్మతో పోట్లాడుతున్నాడు.

అయిదు నిమిషాలు నిశ్శబ్దం.

ఆమె తలవొంచుకు అంది: "ఆ అబ్బాయి ఎవరో మీకు తెలుసా?"

"ఆ. నీకొడుకు" గోపాలం అన్నాడు ఇందాక కుర్రవాడు చెప్పిన మాటల్ని ఆధారం చేసుకొని.

ఆమె అమిత సిగ్గుతో చెప్పలేక, చెప్పలేక చెప్పింది: "మీకొడుకే!"

గడియారం ఆరుగంటలు కొట్టింది.

గోపాలం ఆశ్చర్యటోతూ కుర్రవాడివంక చూచాడు. ఎదుటవున్న నిలువుటద్దంలో తన పాప కన్పిస్తోంది. తన పోలికలు ఆ కుర్రవాడిలో ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తున్నాయి.

కుర్రవాణ్ణి దగ్గరకు లాక్కొని అడిగాడు, "నీ పేరేమిటమ్మా?"

కుర్రవాడు బెదరి చూస్తూ చెప్పాడు: "గోపాలం".

ఆమె నవ్వుతూ అంది: "మీ జ్ఞాపకార్థం పెట్టిన పేరు."

"నాకొడుకు!—నాకొడుకు!"—గోపాలం గొణుగుతూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.